# మధుర భావన – 20 (ఆఖరి భాగం)

అమ్మ ఏమీ మాట్లాడలేదు....నేనే అడిగాను, " ఎలా వుంది అమ్మా, నీకు ఈ మధ్య. చాలానాళ్ళు అయినట్టు అనిపించింది, నీతో మాట్లాడి..అందుకే నీ దగ్గర కూర్చుంటే దిగులు తగ్గుతుందేమో అని వచ్చాను." శ్యామసుందరిలో కదలిక వచ్చింది..." ఎవరమ్మా నువ్వు ? ఏమన్నా సమస్యా మీ ఇంట్లో" ఎంతో మృదువుగా అడిగింది. " అవునమ్మా...సమస్యే, కానీ ఇంట్లోవాళ్ళతో కాదు...నాతో నాకే ! ఎందుకు మనుష్యులందరూ పెద్దయ్యేకొద్దీ స్వార్థంగా తయారవుతారు అన్న నా సందేహానికి సమాధానం దొరకట్లేదు. అది నన్ను బాధిస్తుంది. మునపటి ప్రేమానురాగాలు, ఆప్యాయతలు తగ్గి, వాటి స్థానంలో ధన వ్యామోహం, స్వార్థం పెరగటానికి కారణాలు ఏమిటో అంతు పట్టటంలేదు. మీ కాలంలో అడక్కుండా సహాయం చేసేవాళ్ళు. ఉమ్మడి కుటుంబాలు, అన్నదమ్మల అనురాగాలు, ఇచ్చి పుచ్చుకోవడాలూ ఉండేవి కదమ్మా...ఇప్పుడు అలా ఎవరైనా వుంటే ఆ మంచితనం ఇప్పుడు పిచ్చితనంలా అనిపిస్తుంది అందరికీ "అని స్వగతంలా నేను చెప్పుకుపోతుంటే...అమ్మలో స్పందన కనిపించింది. " అమ్మాయీ.... నువ్వన్నది కొందరి విషయంలో నిజమే కావచ్చు. కానీ అందరినీ ఒకే గాటన కట్టలేం కదా...ఈ సమాజంలో మనం ఇలా ప్రశాంతంగా బ్రతుకుతున్నామంటే....పశుత్వం కన్నా , మానవత్వం పాళ్ళు ఎక్కువ అన్నమాటేకదా....మా ఇంట్లో విషయమే తీసుకో...నాకిద్దరు పిల్లలు. ఇద్దరూ ఎంత అన్యోన్యంగా వుంటారో తెలుసా. చెల్లికన్నా ఆస్తి ముఖ్యం కాదు అనుకునే అన్నయ్యా....అన్నయ్య అనురాగమే అసలైన ఆస్తి అనుకునే చెల్లెలూ...ఇద్దరినీ చూస్తే ముచ్చటగా వుండేది. కానీ ఇప్పుడు ఎందుకో ఇద్దరూ నన్ను చూడటానికి రాలేదు. వాళ్ళెక్కడ వుండేవారో నాకు గుర్తు రావట్లేదు. నీకు ఒక విషయం చెప్పనా...మా వారు బ్రతికి వున్నప్పుడు...తన మొదటి భార్య డబ్బులతో వూరి మధ్యలో స్థలం కొన్నారు. ఆవిడకి ఒక్కడే కొడుకు. అందుకే ఆయన ఆ స్థలం నా పేరున పెడతా అంటే...నేను వారించాను. ఒకేసారి అబ్బాయి పేరనే పెట్టమన్నాను. అప్పుడు మావారేమన్నారంటే... నేను కూడా ముందు అలానే అనుకున్నా. కానీ మన అబ్బాయే అలా చేయద్దని ప్రాధేయపడ్డాడు. " నాన్నా.....నాకు ఊహ తెలిసినప్పటినుంచీ మీరే నాన్న, ఒకటే అమ్మ. ఇప్పుడు కొత్తగా మీరు ఆ స్థలం నా పేరన పెడితే ఎలా ? ఏదైనా మీ పేరనగానీ, అమ్మ పేరనగానీ ఉండాలంతే. ఇలాంటి పని చేసి నన్నూ, అమ్మనూ దూరం చెయ్యకండి, నాన్నా " అన్నాడట ! ఆ తర్వాత కూడా మా అమ్మాయి పెళ్ళిలో మగపెళ్ళివారు అడిగారనీ..లాంఛనాలనీ అన్నీ నెరవేరుస్తుంటే...నేనే బెంగపడ్డాను. అన్ని ఆస్తులూ అమ్మాయికే ఇచ్చేస్తే నీకెలా ? ఏమీ వద్దా ' అంటే..మా అబ్బాయి ఏమన్నాడనుకున్నావు ? " అమ్మా...చెల్లి దూరంగా వెళ్తుంది కదా ! ఆస్తులు తన దగ్గర వున్నా....అసలైన ఆస్తివి, నువ్వు నా దగ్గరే వుంటావు కదమ్మా....నాకింకేం కావాలి " అన్నాడని అమ్మ చెబుతూంటే, తన గొంతు వణకడం స్పష్టంగా గమనించిన నాకు ఇంకా ఏడుపు ఉదృతంగా వచ్చేసింది. అమ్మే నన్ను సముదాయిస్తూ మళ్ళీ..." బాధ పడకమ్మా...ప్రపంచంలో అందరూ ఒకేలా ఉండరు. విలువలు నేర్పుతూ పెంచటం వరకే మన బాధ్యత ! తర్వాత పరిస్థితుల ప్రభావం వలన మనస్తత్వాలలో రకరకాల మార్పులు వచ్చినా మనం చేయగలిగిందేమీ ఉండదు. అలాగని అందరూ అలానే ఉంటారని కూడా నిరాశ చెందకూడదు. ఒక్కోసారి

మనం చూసే దృక్పథం లోనూ తేడా వుంటుంది...అర్థం చేసుకునే కోణంలోనూ వ్యత్యాసం ఉంటుంది " అంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అంత బాగోలేనప్పుడు కూడా అమ్మ భాషలో పరిణితి..ఆలోచనలలో పరిపక్వత చూసి. ఇలాంటి అమ్మ, అన్నయ్యలను ఉంచుకుని, నేను ఏ విధంగానూ వీరి విలువకి సరితూగని స్థలం నాకు రాసిచ్చేయమని గొడవ పడ్డానా అని చాలా సిగ్గు పడ్డాను. వెంటనే అక్కడనుంచి వచ్చేసాను. తర్వాత నా వలనే మనస్తాపం చెంది, అమ్మకీ మతిమరపు అనే మానసిక  వ్యాధి వచ్చిందేమోనని కూడా నాకు అనిపించింది. దీనికి కారణమైన నేనే అమ్మ భాద్యత కూడా తీసుకోవాలని నిశ్చయించుకున్నా. 'అన్నయ్యా...అమ్మను నాతో కొన్నాళ్ళు ఉంచుకోవచ్చా'..అని నిన్ను అడుగుదామనుకుంటున్నాను. మళ్ళీ అమ్మ సాన్నిహిత్యంలో ఉంటే, అమ్మకి వచ్చిన మానసిక అనారోగ్యం తగ్గటం కాదు...నాకొచ్చిన మనోవైకల్యం తగ్గుతుంది అనిపిస్తుంది.

అన్నయ్యా...ఇపుడు చెబుతున్నాను...నువ్వు అనుభవించిన ఇవ్వటంలోని రుచిని నన్నూ ఆస్వాదించనివ్వు. నాకు ఆ స్థలం అవసరం లేదు. నిజానికి ఇందులో మా అత్తగారూ వాళ్ళదిగానీ...మా ఆయనది గానీ ప్రమేయమేమీ లేనే లేదు ! నేనే ఆడబడుచు లాంఛనంగా కావాలని అడిగానంతే!  అయితే అమ్మ వలన ఇది వీలుపడలేదు. అయినాసరే, నేను పట్టు వదలక...సుమజ అయితే నువ్వు ఒప్పుకున్నా పడనిస్తుందో లేదో అని మా ఆడపడుచు తిలోత్తమను నీ దగ్గరకు పంపాను ! నీకెంతో నచ్చిన, నువ్వు ఇష్టపడిన సుమజతో నీ వివాహం కాకూడదని స్వార్థంతో ఇలాంటి పథక రచన చేసినందుకు నా మీద నాకే ఎంతో చిరాగ్గా అనిపిస్తుంది. కానీ నిజంగా నువ్వు తిలోత్తమని పెళ్ళి చేసుకోవటానికి ఇష్టం చూపిస్తున్నావని తను చెప్పగానే...నాకు ఆనందం కలగలేదు సరికదా..అంతర్మథనం కలుగుతోంది ! ఈ మధ్య కాలంలో ఈటెల్లాంటి మాటలతో నిన్ను చాలా బాధపెట్టాను. ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నాను. నన్ను క్షమిస్తావు కదూ ! నిన్నే కాదు, నేను సుమజను కూడా క్షమాపణ అడుగుతాను. సుమజ లాంటి వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి, మన ఇంటికి వస్తున్నందుకు నాకు చాలా గర్వంగా ఉంది కూడా. తనని ఎంతో ఆదరంగా ఇంటికి ఆహ్వానించాల్సిన నేను, తన రాకను వ్యతిరేకిస్తూ చేసిన స్వార్థపూరితమైన చేష్టలకు నిజంగా సిగ్గు పడుతున్నాను. అందుకే క్షమాపణలతో ఈ ఉత్తరం...అర్థమైందిగా..? అమ్మ ఆరోగ్యమే మనకు ముఖ్యం !    దానికోసం నేను ఏంచేయాల్సివచ్చినా ...సిద్ధమేనని చెప్పదలుచుకున్నాను.

నీ గారాల ముద్దుల చెల్లెలు అనూష.

ఉత్తరం చదవటం పూర్తిచేసిన శ్యామసుందరి చాలా ఆనందంగా కళ్ళు తుడుచుకుంది. " అనూషలో మార్పు వచ్చిందేమో అని నాకూ తను మొన్న వచ్చినపుడు అనిపించిందిగానీ..ఇంతలా ఆలోచిస్తుందని ఊహించలేదు. అనూ..నీకు తగిన చెల్లెలనిపించుకుంది !" అంది డగ్గుత్తికతో.

" అహ కాదమ్మా....మేం ఇద్దరం నీ పిల్లలమనిపించుకున్నాం ! అంతే..!" అన్నాడు వంశీ ఆనందంగా.

ఆవిడ కొంచెం గొణుగుతున్నట్లుగా " మేం చేసింది ఏం వుందీ...అందరిలానే పిల్లలను తిండీ, బట్టా ఇచ్చి పెంచాం ...అంతేగా ! " అందావిడ.

"కాదమ్మా....తిండీ, బట్టా ఇవ్వటం వేరు. సమాజంలో మంచి పౌరుల్లా ఎదగాలని మామూలు ఆహారంతో పాటుగా విలువలనూ, ప్రేమామృతాన్ని చవిచూపిస్తూ పెంచావమ్మా ! అందుకే మనుష్యులూ...ప్రేమాభిమానాలే అసలైన ఆస్తిపాస్తులని గుర్తించగలిగాం..తెలుసా" అన్నాడు వంశీ.

శ్యామసుందరి నిట్టూర్చింది " అలా మీరు అర్థం చేసుకోవటం...ఆచరించటం మాత్రం మా అదృష్టం..అంతే " అంటూనే...ఒక క్షణం మౌనంగా వున్న ఆవిడ వంశీతో మళ్ళీ అంది " సుమజా వాళ్ళకు నేను ఇంటికి వచ్చిన విషయం చెప్పు. మొన్న సుమజా, వాళ్ళమ్మగారూ నన్ను చూడటానికి వచ్చినప్పుడు....ఆవిడ చాలా నిష్టూరంగా మాట్లాడారు. ఏదో బాధ పడ్డారని అర్థమైంది గానీ ఏంటో సరిగ్గా తెలియక నేను చాలా తికమక పడ్డాను. ఎలా అడగాలో కూడా అర్థం కాలేదు. నువ్వు సుమజకి ఇదంతా వివరించి చెప్పు. వెంటనే పెళ్ళి గురించీ ఆలోచన చేద్దాం!"

"తప్పకుండా వెంటనే చెబుతానమ్మా...నీది నిజమైన మతిమరుపు అవునా కాదా అని పరీక్షించటానికే తిలోత్తమతో పెళ్ళి నాటకం అని తనకి వివరిస్తూ ఉత్తరం రాసాను. కానీ ఇప్పుడు నువ్వు ఆరోగ్యంగా ఇంటికి వచ్చిన విషయం, అనూలో వచ్చిన మార్పూ వివరంగా సుమజకి చెప్తాను." అంటూ వంశీ హుషారుగా లేచాడు.

తన గదిలోకి వెళ్ళిన వంశీ సుమజకు ఫోన్ చేసాడు. ఆ ఫోన్ కోసమే ఎదురు చూస్తున్నట్లుగా రెండో రింగుకే సుమజ ఫోన్ తీసింది. 'సుమా' అన్న తన పిలుపు తనకే పరవశంగా అనిపించగా సుమ కూడా మనోహరంగా నవ్వింది. తను చెప్పేలోగా గబగబా ఊపిరి కూడా తీసుకోకుండా..." ఇప్పుడే మీ ఉత్తరం చదవటం పూర్తి చేసి...మా అమ్మకు కూడా విషయం వివరించి చెప్పాను. అమ్మ కూడా చాలా ఆనందించింది. అవునూ...అయితే అంతా సవ్యంగా జరిగిందిగా ! మీ ఆలోచన ఫలించిందా ! " ప్రశ్నల వర్షం సంధించింది.

వంశీ కూడా అంతే ఆనందంగా జరిగిన సంగతులన్నీ పూస గుచ్చినట్లు వివరంగా చెప్పాడు.

సుమజ వెంటనే సందేహంగా నసుగుతూ "మరి తిలోత్తమ ...?" అని ఆగిపోయింది .

వంశీ నవ్వాడు "తను ఊరుకి ... వెళ్ళిపోయింది... 'తిక్క తిలోత్తమ' అనే నిక్ నేమ్ ని వదిలేసి.. 'అతి చక్కని తిలోత్తమ' అనే బిరుదుతో వెళ్ళింది!"

"సుమజ నిట్టూర్చింది" నాకెందుకో, తన విషయంగా చాలా బాధ కలిగింది!"

"ఎందుకూ...? తిలోత్తమ నిన్నే ఆదర్శంగా తీసుకుని నిర్విచారంగా ఉంది. నీ వ్యక్తిత్వానికి తను కూడా ముగ్ధురాలైనట్టు చెప్పింది కూడా. అమ్మతో సరదాగా నవ్వుతూ ధైర్యం చెప్పి వెళ్ళింది. మన పెళ్ళిలో సందడంతా తనదేనని కూడా చెప్పింది. కల్మషం లేని తన మనసుకి అమ్మ మురిసిపోయింది కూడా."

సుమజ ఆనందంగా ఊపిరి తీసుకుని వదిలింది.." పోనీలెండి. అంతా మన మంచికే జరుగుతుందని అందుకే పెద్దలు అన్నారు. మీ అమ్మగారి నాటకం వలన అనూ లో మార్పు వచ్చి అసలైన ఆస్తి ఏమిటో గుర్తించగలిగింది

గదా....అందరిలో ఈ పరివర్తన ఇంత త్వరగా సాధ్యం కాదు. తన నిర్ణయం స్వార్థపూరితమని తన మనసే ఎదురు తిరగటం వలన మీ అనూష అంత త్వరగా మంచి నిర్ణయం తీసుకోగలిగింది. మీ అన్నాచెల్లెళ్ళ మధ్య మళ్ళీ ప్రేమపూరితమైన అనురాగ వాత్సల్యాలు ఏర్పడటం నాకెంతో ఆనందంగా అనిపిస్తుంది. మీ ఇద్దరి అన్యోన్యతకు ఎవరి దిష్టో తగిలిందనుకుందాం...సరేనా..." అంటూ అల్లరిగా నవ్వింది సుమ. మళ్ళీ వెంటనే.." నేనో మాట చెప్పనా... మధుర భావన అనేది మీ నాన్నగారు మీ ఇద్దరి గురించీ కన్న కల కదా...! అందుకే తప్పకుండా మనం కట్టుకోబోయే మధుర భావన అనే ఇంటిలో మీ చెల్లికీ భాగస్వామ్యం వుండాలి. ఆ స్థలం లో అన్నా చెల్లెళ్ళు ఇద్దరూ ఇళ్ళు కట్టుకుని కలిసి ఉంటే..మీ అమ్మగారికీ ఆనందంగా ఉంటుందీ.. మీ నాన్నగారి కల నెరవేరినట్టూ ఉంటుంది....ఏమంటారు ? "

" ఏమనగలను ? నీ మానసిక సౌందర్యానికి దాసోహమనడం తప్ప ! నా మనసు ఆనందంతో కేరింతలు కొడుతూ ఏమని ఆలపిస్తుందో చెప్పనా...? " అంటూ క్షణం ఆగి

" మధుర భావాల సుమ మాల...

మనసులో పూచే ఈ వేళ....

మనసు మురిపాల దొంతరలో...

ఊయలూగాలి ప్రతి వేళా...." అంటూ సన్నగా రాగం తీసాడు.

మనసులో మురిసిపోతూ సుమ..పైకి మాత్రం " అబ్బో...అబ్బాయి గారికి పేరడీ కవిత్వం కూడా వస్తుందే.." అంటూ తమాషాగా నవ్వింది.

" సహవాస దోషం దేవి గారూ...మరి ఇంత మధురమైన రేయిలో నీకేమనిపిస్తుందో చెప్పవా...? "

"నా మనసు కూడా మీలానే ప్రేమ మందిరానికి పేరడీ పాట ను ఆలపిస్తుంది...

కలకాలం కలిసి ఉండే అనురాగ జీవనం...

మధురమైన భావాలతో మన జన్మలు పావనం...

మధుర భావనా....ఇదే మధుర భావనా....

మధుర భావనా...మన మధుర భావనా....."

అంటూ పరవశంగా రాగం తీసిన సుమ క్షణం తర్వాత అడిగింది... "అవునూ... అత్తయ్య ఎలా ఉన్నారూ...?"

వంశీ సరదాగా సమాధానం చెప్పాడు "మన మిద్దరం 'నేను' నుండి 'మనం' గా మారటానికి ఏర్పాటు చేసే పనిలో కొంచెం బిజీగా ఉన్నారు..!"

'పెళ్ళి పనులు' అనే మాటకి వేరే అర్థంలో చెప్పాడని సుమజకూ అర్థమైంది. పకపకనవ్వింది "అవునా...?" అంటూ ఆ వెంటనే మరి... మీరు...?" అనడిగింది.

"నేనా..." అంటూ వంశీ తమాసాగా చెప్పాడు.

"మధుర భావాల పారిజాతాలు... మన జీవిత వనంలో నిత్యమూ పరిమళించాలని కలలు కంటున్నాను...!"

ఆ మాటకి వెంటనే సుమజ " అంతేకాదు... ముద్దు మురిపాల మణిమాణిక్యాలు మన జీవనయానంలో దివ్వెలుగా నిలవాలని నేనూ కోరుకుంటున్నాను...! " అంటూ సరదాగా నవ్వింది.

వంశీ కూడా ఆ నవ్వుకు జతగా హాయిగా నవ్వాడు.

అలా వారిద్దరూ ఆనంద డోలికల్లో తేలియాడుతూ పరవశం పొందుతున్నట్టుగా..మాటలతో పనిలేని మధుర భావ లహరిలో మునిగిపోయారు.

*******

*** సమాప్తం ***